సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 4 । డిసెంబర్ । 2024



సీఎం పర్యటన నేపథ్యంలో ముస్తాబైన సభాస్థలి

షెడ్యూల్ ఇలా..

సాయంత్రం 4 గంటలకు : రంగంపల్లి సబ్‌స్టేషన్ వెనకనున్న హెలిప్యాడ్‌లో సీఎం ల్యాండ్ అవుతారు.

- **సాయంత్రం 4 నుంచి 4.10 వరకు:** వివిధ పనులకు శంకుస్థాపనలు
- **4.10 నుంచి 4.30 వరకు:** ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శిస్తారు
- **4.30 నుంచి 4.35 వరకు:** రాష్ట్ర గీతం ఆలాపన
- **4.35 నుంచి 4.55 వరకు:** రాష్ట్ర మంత్రుల ప్రసంగం
- **4.55 నుంచి 5.10 వరకు:** నియామక పత్రాల అందజేత
- **5.10 నుంచి 5.20 వరకు:** డిప్యూటీ సీఎం భట్టి ప్రసంగం
- **5.20 నుంచి 5.50 వరకు:** సీఎం రేవంత్‌రెడ్డి స్పీచ్
- **సాయంత్రం 5.50 గంటల** హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం

వరాల జల్లు కురిసేనా

- నేడు జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- హామీల ప్రకటనపై జిల్లావాసుల గంపెడాశలు

సాక్షి, పెద్దపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం జిల్లాకు రానున్న సందర్భంగా జిల్లా ప్రజలు ఆశలు పెంచుకున్నారు. ఈ పర్యటన ద్వారా జిల్లాపై వరాల జల్లు కురిపిస్తారని ఆశిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, పెండింగ్ సమస్యల పరిష్కారం చూపుతారని, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి కార్యాచరణ ప్రకటిస్తారని ఆశతో ఉన్నారు. సీఎం హోదాలో తొలిసారిగా రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో పెద్ద మొత్తంలో నిధులు అందిస్తారని ఆశిస్తున్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు..

- వైఎస్సార్ హ యాంలో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రారంభోత్సవం
- ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో వెల్గటూర్ మండలం కోటిలింగాల వద్ద టూరిజం బోటింగ్
- రామగిరి ఖిల్లా, రాముని గుండాలు, ఆదివరాహ స్వామి, మంథని పుణ్యక్షేత్రాలను కలుపుతూ టెంపుల్ టూరిజం, సింగరేణి గనులు ఉన్న గోదావరిఖనిలో మైనింగ్ టూరిజం డెవలప్‌మెంట్‌తో టూరిజం సర్క్యూట్
- రామగుండంలో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రికి భూ కేటాయింపు
- బీ– థర్మల్ పవర్‌ప్లాంట్ శంకుస్థాపనపై అధికారిక ప్రకటన
- సింగరేణి కార్మికుల సొంతింటి కల, ఓపెన్ కాస్ట్‌ల బంద్, గనుల ప్రైవేటీకరణ, ఐటీ మినహాయింపు, మారు పేర్ల సమస్యకు పరిష్కారం
- ఆర్ఎఫ్‌సీఎల్ ప్రభావిత గ్రామం వీరపల్లికి పునరావాసం
- మానేరుపై ఓడేడు వద్ద బ్రిడ్జి నిర్మాణం
- సింగరేణి, కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ భూనిర్వాసితులకు పరిహారం
- పెద్దపల్లిలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ
- గర్రెపల్లి, పెద్దపల్లి రూరల్, గుంజపడుగు కొత్త మండలాల ఏర్పాటు



సభ ప్రాంగణం

ప్రజల ఆశీర్వాదం కోసం
సీఎం వస్తున్నారు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావు

- పత్తిపాక రిజర్వాయర్, పెద్దపల్లి బస్ డిపో ప్రకటిస్తారు
- 'యువవికాసం' సభ విజయవంతం చేయండి
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, పెద్దపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది ప్రజా పాలనను పురస్కరించుకొని, ప్రజల ఆశీర్వాదం తీసుకునేందుకు సభ నిర్వహిస్తున్నామని, దానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. జిల్లాలో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగా పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం కోసం సర్వేకు సంబంధించి నిధుల విడుదల చేయడంతో పాటుగా పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటుపై అధికార ప్రకటన చేస్తారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నాలకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని, తరుగు పేరిట ఒక్క గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నామని వివరించారు. రూ.5కోట్లతో మహిళల కోసం స్వశక్తి మహిళా ప్రాంగణ నిర్మాణం, అంతర్గాం, మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి, మంథని మండలం పోతారంలో మూడు 33కేవీ సబ్ స్టేషన్లు, బండల వాగు ప్రాజెక్టు కోసం సబ్ స్టేషన్, పెద్దపల్లి, రామగుండం, మంథని, సుల్తానాబాద్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కోసం రూ. 51 కోట్లతో వివిధ పనుల కోసం, ఓదెల మండలం రూపునారాయణపేట వద్ద హై లెవెల్ వంతెన కోసం రూ. 80కోట్లతో పనులు, మంథని సీహెచ్‌సీని 100పడకలుగా మార్చడం, గుంజపడుగులో 30 పడకలతో ఆసుపత్రి, పెద్దపల్లిలోని జిల్లా ఆసుపత్రిని 50పడకల నుంచి 150పడకలుగా అప్‌గ్రేడ్ పనులు, ఎలిగేడులో పోలీస్‌స్టేషన్, పెద్దపల్లిలో మహిళా, రూరల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల మంజూరు పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. అలాగే నూతనంగా ఎన్నికైన 9వేల మంది గ్రూప్– 4 అభ్యర్థులు, సింగరేణిలో 596మంది ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేస్తామన్నారు. బుధవారం నిర్వహించే విజయోత్సవ సభను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

అనుబంధమా..
నువ్వెక్కడ?



వివరాలు 8లో

క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రులకు మహర్దశ



మంథని సామాజిక వైద్యశాల

మంథని: మంథని ప్రభుత్వాసుపత్రికి మహర్దశ రానుంది. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు ముందే జిల్లా ఆస్పత్రులకు అప్‌గ్రేడ్ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం 50 పడకలతో కొనసాగుతున్న మంథని ప్రధాన ఆస్పత్రిని వందపడకలకు అప్‌గ్రేడ్ చేశారు. అలాగే నాన్ రికరింగ్ ఖర్చుల నిమిత్తం రూ. 51 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మంథని సామాజిక వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్తగా 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ. 22 కోట్లకు అనుమతులు లభించాయి. అలాగే మంథని మండలం గుంజపడుగులో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రూ.2.45 కోట్లు మంజూరయ్యాయి. గుంజపడుగులో ప్రస్తుతం పల్లె దావాఖానా కొనసాగుతుంది.

శ్రీపాదరావు మార్గ్ నిర్మాణానికి రూ.162కోట్లు

మంథనిలో నాలుగు లేన్ల బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.162 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నెరవేరిన కల



ఎలిగేడు మండల కేంద్రం

ఎలిగేడు(పెద్దపల్లి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 57వ మండలంగా ఏర్పడిన ఎలిగేడు మండల ప్రజల 23ఏళ్ల నిరీక్షణ ఫలిచింది. ఎట్టకేలకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కృషితో పోలీస్‌స్టేషన్ మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2001లో జూలపల్లి మండలం నుంచి 10 గ్రామాలతో ఎలిగేడు మండలం ఏర్పడగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభించారు. ఒక్క పోలీసుస్టేషన్ మాత్రం ఏర్పాటు కాలేదు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటుపై ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతి పత్రాలను ఇచ్చినా స్పందనలేదు. పోలీసుస్టేషన్ ఏర్పాటుచేయాలని 2012లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దేవరనేని వేణుమాధవరావు ఆధ్వర్యంలో ఒకరోజు దీక్ష నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎలిగేడు మండలానికి పోలీస్‌స్టేషన్ తీసుకువస్తానని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ప్రచారం చేపట్టిన కాంగ్రెస్ అభ్యర్థి చింతకుంట విజయరమణారావు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పోలీసుస్టేషన్‌ను మంజూరు చేయించడంపై మండల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు



మాట్లాడుతున్న జడ్జి దుర్గం గణేశ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ సూచించారు. వికలాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని దివ్యాంగుల కేంద్రంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే మండల విద్యా వనరుల కేంద్రం దివ్యాంగ పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించారు.

సాఫీగా సాగేలా.. సత్తా చాటేలా..

- లక్ష మందికి పైగా జనసమీకరణకు కాంగ్రెస్ శ్రేణుల కసరత్తు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ యంత్రాంగం
- గ్రూప్- 4, సింగరేణి నూతన ఉద్యోగులకు నియామక పత్రాలు..
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, పెద్దపల్లి: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్వహించే 'యువ వికాసం' సభకు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సుమారు 50 మంది ఆసీనులయ్యేలా వేదికను సిద్ధం చేశారు. కళా బృందాల ప్రదర్శనకు వేదిక, పారిశ్రామిక ప్రగతిని తెలిపేలా ప్రత్యేక స్టాల్స్‌ను సభ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాఫీగా సాగేలా అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేయగా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సుమారు 2వేల మందితో పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.

జన సమీకరణపై ప్రత్యేక దృష్టి

మొదటిసారి సీఎం హోదాలో జిల్లాకు రేవంత్‌రెడ్డి వస్తుండటం, ఏడాది పాలన ముగిసిన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న సభ కావడంతో జిల్లా ప్రజాప్రతినిధులు జనసమీకరణపై ప్రత్యేకంగా ఫోకస్ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మండలాల నుంచి సుమారు లక్షమందిని తరలించి తమ సత్తా చాటేలా నేతలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.



సభా ప్రాంగణం



వేదిక వద్ద పోలీసు అధికారుల పర్యవేక్షణ

భారీ బందోబస్తు

సీఎం సభకు దాదాపు లక్షమంది హాజరయ్యే అవకాశాలున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పార్కింగ్, ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ఏడుగురు ఎస్పీలు, వీరికి అదనంగా ముగ్గురు ఎస్పీలు, ఏసీపీలు ఏడుగురు, 48 మంది సీఐలు, 124 మంది ఎస్సైలు, 15మంది మహిళా ఎస్సైలు, 316 మంది ఏఎస్సైలు, 846 మంది కానిస్టేబుల్స్, 384 మంది హోం గార్డులు, 70 మంది క్యూఆర్‌టీ మెంబర్స్, 10 స్పెషల్ పార్టీల పోలీసులకు విధులు కేటాయించారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్, పబ్లిక్ మీటింగ్, శిలాఫలకాల ప్రారంభోత్సవాలు, రూఫ్‌టాప్, పబ్లిక్ మీటింగ్, డయాస్, పార్కింగ్ ప్రాంతాల వద్ద ఉండే పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

పలు మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు

- సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సీఎం ప్రోగ్రాం పూర్తయ్యేవరకు ట్రాఫిక్ డైవర్షన్ కొనసాగుతుందని రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా అందరూ సహకరించాలని కోరారు.
- రామగుండం నుంచి కరీంనగర్ వైపు వెళ్లే అన్ని వాహనాలు ధర్మారం క్రాస్ రోడ్డు (బసంత్‌నగర్) ద్వారా కుక్కలగూడూరు, రాజారాంపల్లి, ధర్మారం, చొప్పదండి మీదుగా కరీంనగర్ వెళ్లాలి.
- మంథని వైపు నుంచి కరీంనగర్ పోయే భారీ వాహనాలు అప్పన్నపేట, ధర్మారం క్రాస్‌రోడ్డు (బసంత్‌నగర్) ద్వారా కుక్కలగూడూరు, రాజారాంపల్లి, ధర్మారం, చొప్పదండి మీదుగా వెళ్లాలి.
- మంథని వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్లు 4 వీలర్లు అప్పన్నపేట నుంచి ఎడమ వైపు తీసుకుని బొంపల్లి, దొంగతుర్తి, ధర్మారం, చొప్పదండి ద్వారా వెళ్లాలి.
- కరీంనగర్ నుంచి రామగుండం, మంథని వైపు వెళ్లు భారీ వాహనాలు ముగ్దుంపూర్ క్రాస్ రోడ్ నుంచి కరీంనగర్–లక్సెట్టిపేట రోడ్ ద్వారా చొప్పదండి, ధర్మారం, రాజారాంపల్లి వద్ద కుడి వైపు తీసుకుని కుక్కలగూడూర్, ధర్మారం క్రాస్‌రోడ్డు ద్వారా రాజీవ్ రహదారి (కరీంనగర్– రామగుండం)కి చేరుకుని రామగుండం, మంథని వైపు వెళ్లాలి.
- కరీంనగర్ నుంచి పెద్దపల్లి, రామగుండం వైపు వచ్చే 4 వీలర్‌లు సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ క్రాస్ రోడ్డు నుంచి నారాయణపూర్, కొదురుపాక, నిమ్మనపల్లి, పెద్దపల్లి సాగర్ రోడ్, జూనియర్ కాలేజ్ రోడ్(ఎంబీ గార్డెన్ రోడ్), అయ్యప్ప జంక్షన్ ద్వారా రామగుండం, మంథని వైపు వెళ్లవచ్చు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

- స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి 7 ఏజెన్సీలతో ఎంవోయూ ఒప్పందాలు
- తెలంగాణ డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ (డీఈఈటీ), సీఎం కప్ ఆవిష్కరణ
- రూ.260 కోట్ల విలువైన ఆర్‌అండ్‌బీ పనులకు శంకుస్థాపన
- రూ.66కోట్ల విలువైన పంచాయతీరాజ్ పనులు, రూ.10కోట్లతో నిర్మించే సబ్‌స్టేషన్స్
- రూ.26 కోట్లతో నర్సింగ్ కాలేజీ నిర్మాణం, రూ.10కోట్లతో శాతవాహన కాలేజీ అకాడమీ బ్లాక్, రూ.5కోట్లతో నూతన జిల్లా గ్రంథాలయ నిర్మాణం
- 50 పడకల నుంచి 150 పడకలకు జిల్లా ఆసుపత్రి అప్‌గ్రేడ్, మంథని సీహెచ్‌సీ 100 పడకలకు అప్‌గ్రేడ్, గుంజపడగలో కొత్తగా 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు
- నూతనంగా 4 పోలీస్ స్టేషన్స్ ఏర్పాటు
- జిల్లాలోని నాలుగు బల్దియాల్లో రూ.51కోట్ల అభివృద్ధి పనులకు
- రూ.80కోట్లతో ఓదెల మండలం రూప్‌నారాయణ గ్రామంలో గోదావరినదిపై నిర్మించే బ్రిడ్జి
- రూ.5కోట్లతో హుస్సేనిమియా వాగు పై వంతెన
- పెద్దపల్లి, సుల్తానాబాద్ బైపాస్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు

ఇసుకలో కూరుకుపోయి..

- జీడీకే–7 ఎల్ఈపీ గని ఇన్‌చార్జి మేనేజర్ మృతి
- సేఫ్టీ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్లే?
- జనరల్ మజ్దూర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని జీడీకే–7 ఎల్ఈపీ గని స్టవింగ్ బంకర్‌లో పడి ఇన్‌చార్జి మేనేజర్ తీట్ల సత్యనారాయణ(44) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. బసంత్‌నగర్‌లోని రాంనగర్‌కు చెందిన సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి యైటింక్లయిన్ కాలనీలో ఉంటున్నారు. స్టవింగ్ బంకర్‌లో మల్మా పేరుకుపోవడంతో మంగళవారం జనరల్ మజ్దూర్ కార్మికుడు క్రాంతికుమార్ సేఫ్టీ బెల్ట్‌తో బంకర్‌లోకి దిగి, తొలగిస్తున్నాడు. ఈ పనులను అక్కడే ఉండి, పర్యవేక్షిస్తున్న సత్యనారాయణ ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. ఇసుకలో కూరుకుపోయి, ఊపిరాడక మృతిచెందాడు. క్రాంతికుమార్‌ను రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. 4 గంటలపాటు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి, సత్యనారాయణ మృతదేహాన్ని వెలికితీశారు. సేఫ్టీ బెల్ట్ పెట్టుకుంటే ఆయన ప్రాణాలు దక్కేవని కార్మికులు అంటున్నారు.

డీడీఎంఎస్ ఆదేశాలతో..

మూసివేసిన జీడీకే–7 ఎల్ఈపీ గనిలో కొన్ని ఫిల్లర్ల ప్రాంతంలో ఇసుకను నింపాలని డీడీఎంఎస్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గనిలోని 182వ ఫిల్లర్ వద్ద బొగ్గును వెలికితీసి, ఇసుక నింపలేదని గుర్తించారు. భవిష్యత్ రక్షణను దృష్టిలో పెట్టుకొని, ఖాళీగా ఉన్న ప్రాంతాలను స్టవింగ్ చేయాలని సూచించారు. దీంతో వారం రోజులుగా సంబంధిత పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.



సత్యనారాయణ మృతదేహం

మృతుని కుటుంబంలో ఒకరికి సూటబుల్ జాబ్‌కు అంగీకారం

ఇన్‌చార్జి మేనేజర్ సత్యనారాయణ కుటుంబంలో ఒకరికి సూటబుల్ ఉద్యోగం ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏరియా ఆస్పత్రికి చేరుకొని, సత్యనారాయణ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. చివరకు సూటబుల్ జాబ్‌కు అధికారులు అంగీకరించారు.

గతంలో ఇలాంటి సంఘటన..

2008లో ఇదే ఏరియాలో జీడీకే–8 గనికి చెందిన రమణారెడ్డి అనే కార్మికుడు సాండ్ బంకర్ వద్ద ఇసుకను తొలగిస్తూ అందులోనే పడి మృతిచెందాడు. ఇసుక బంకర్ల వద్ద పనిచేసే సమయంలో ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలనే అంశంపై సింగరేణి యాజమాన్యం దిశానిర్దేశం చేయలేదా? ఒకవేళ చేసి ఉంటే ఎందుకు అమలు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.



బంకర్ వద్ద రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది

భవిష్యత్తులో జరగకుండా చూడాలి

ఆర్జీ–2 ఏరియా ఇన్‌చార్జి మేనేజర్ సత్యనారాయణ మృతి బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్న. బాధిత కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్న. యాజమాన్యం భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– గడ్డం వంశీ, పెద్దపల్లి ఎంపీ

రక్షణ చర్యల్లో నిర్లక్ష్యం

రక్షణ చర్యల్లో యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. సరైన రక్షణ చర్యలు చేపడితే సత్యనారాయణ మృతిచెందేవారు కాదు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలి. మృతుని కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి.

– ఎంఎస్.రాజ్‌ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే

మృతదేహం కోసం ఎదురుచూపు

- ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన రాణాపూర్‌వాసి మల్లయ్య
- విషమిచ్చి చంపారని హైకోర్టులో భార్య పిటిషన్

పాలకుర్తి(రామగుండం): ములుగు జిల్లా ఏటూరునాగా రంలో ఆదివారం తెల్ల వారుజా మున జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాలకుర్తి మండలంలోని రాణా పూర్‌వాసి ఏగోళపు మల్లయ్య అలియాస్ మధు మృతిచెందిన విషయం విధితమే. ఆయన మృతదేహం కోసం కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఎదురుచూస్తున్నా రు. కాగా, అది బూటకపు ఎన్‌కౌంటర్ అని, పోలీ సులే విషమిచ్చి, తర్వాత కాల్చి చంపారని మృతుడి భార్య మీనా ఆరోపిస్తోంది. తన భర్త మృతదేహానికి రీపోస్టుమార్టం జరిపించాలని కోరుతూ సోమవా రం హైకోర్టులో పిటిషన్ వేసింది. మంగళవారం వి చారణకు రాగా, న్యాయమూర్తి గురువారానికి వా యిదా వేశారు. ఎవరి సమక్షంలో రీపోస్టుమార్టం ని ర్వహించాలనే విషయాన్ని వెల్లడిస్తామని, అప్పటివరకు మృతదేహాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో భద్రపరచాలని కోర్టు ఆదేశించినట్లు మల్లయ్య కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం తెల్లవారుజా మున మల్లయ్య మృతదేహం కోసం ఆయన సోదరులు, పలువురు గ్రామస్తులు ఏటూరునాగారం వెళ్లారు. కేసు వాయిదా పడటంతో మంగళవారం తిరిగి స్వగ్రామం చేరుకున్నారు. కోర్టు తీర్పు వచ్చా క మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు వెళ్తామని తెలిపారు.



మల్లయ్య (ఫైల్)

పుష్కర కాలానికి మంజూరైన బైపాస్

పెద్దపల్లిరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రధాన పట్టణంగా ఉన్న పెద్దపల్లి నాటి పాలకుల చేతిలో అభివృద్ధి చెందక చిన్నబోయింది. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో ఎమ్మెల్యే విజయరమణారావు పలుమార్లు సీఎంను కలిసి విన్నవించుకు న్న ఫలితంగా బైపాస్ మంజూరైంది.

నిరీక్షణకు చెక్

బైపాస్‌రోడ్డు నిర్మాణానికి దివంగత మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి చొరవతో ప్రభుత్వానికి ప్ర తిపాదనలు వెళ్లాయి. జగిత్యాల– ధర్మారం మార్గం వైపు నిర్మించిన ఆ బైపాస్ రోడ్డు ఇప్పుడు జగిత్యాల–పెద్దపల్లి బైపాస్‌గా ఉంది. ఇంతలో పెద్దపల్లి జిల్లా కేంద్రం కావడం బైపాస్‌పై దృష్టి సన్నగిల్లింది. ఏడాది క్రితం రేవంత్‌రెడ్డి ఎన్నికల సభలో ఇచ్చిన హామీని సీఎం హోదాలో తొలిసారిగా పెద్దపల్లికి వస్తున్న చివరిక్షణంలో నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో హర్షం వ్యక్తమవుతోంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రామగిరి(మంథని): తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుల వివరాలు.. రామగిరి మండలం నాగెపల్లికి చెందిన వావిలాల రాజేందర్ మణుగూరు మైన్స్‌లో ఈపీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. నాగెపల్లిలో ఉంటున్న ఆయన భార్య సాధన కుటుంబసభ్యులతో కలిసి గత నెల 30న గోదావరిఖనిలోని తల్లిగారింటికి వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి రాగా, ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని తులం బంగారం, రూ.20 వేల విలువైన వెండి ఆభరణాలు, రూ.30 వేలు కనిపించలేదు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, భర్త రాజేందర్‌కు సమాచారం ఇచ్చింది. ఎస్సై చంద్రకుమార్‌ను వివరణ కోరగా చోరీ జరిగినట్లు తమకు ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

కొత్త విద్యుత్ ప్రాజెక్టులతో వెలుగులు

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ(రామగుండం): గత పాలకుల నిర్లక్ష్యంతో రామగుండంలో చీకట్లు నిండాయని, కొత్త విద్యుత్ ప్రాజెక్టులతో వెలుగులు నింపే ప్రయత్నం చేస్తున్నామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రామగుండం బల్దియా కార్యాలయ ఆవరణలో మంగళవారం అర్బన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. బొందల గడ్డగా మారిన రామగుండం నగరానికి పునర్వైభవం తీసుకువచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.30 వేల కోట్లతో కొత్త విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయించి 40 వేల మందికి స్థానికంగా ఉద్యోగ అవకాశాలను పెంపొందించే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా రాజ్‌ఠాకూర్ ఎన్నికైన వెంటనే సుమారు రూ.250 కోట్ల నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించడంతో నగరంలోఅభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం స్వశక్తి సంఘాలకు స్త్రీనిధి ద్వారా మంజూరైన రూ.కోటి, బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.4.10 కోట్ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మహిళా సమాఖ్యలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవడానికి 45 టాబ్‌లు అందజేశారు. 14 మంది ఉత్తమ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అనుబంధమా.. నువ్వెక్కడ?

- విలువలు మరిచి, అయినవారి ఆయువు తీస్తున్నారు..
- ఆస్తి పంపకాలు, కుటుంబ వివాదాలే కారణం
- అనుమానం, వివాహేతర సంబంధాలతో హత్యలు
- ఉమ్మడి జిల్లాలో ఆందోళనకర ఘటనలు



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వేంపల్లికి చెందిన వెల్మల రమేశ్‌కు రాయికల్ మండలం అల్లీపూర్‌కు చెందిన సునీతతో 2015లో వివాహమైంది. వీరికి ఒక పాప, బాబు సంతానం. కొంతకాలంగా వెంకట్రావ్‌పేటలో ఉంటున్నారు. రమేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లొస్తున్నాడు. ఇటీవలే ఇంటికొచ్చిన అతనికి సునీత వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానం కలిగింది. ఇదే విషయమై, అక్టోబర్ 30న గొడవపడ్డారు. రమేశ్ క్షణికావేశంలో సునీత ముఖంపై బలంగా కొట్టాడు. గొంతు నులిమి హతమార్చి, అక్కడి నుంచి పరారయ్యాడు. రెండు రోజుల తర్వాత నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

ఈ నెల 2న అర్ధరాత్రి వెల్గటూర్ మండలంలోని కుమ్మరిపల్లిలో బొమ్మల సుమన్(36)ను అతని తమ్ముడే దారుణంగా హత్య చేశాడు. భూమి విక్రయించగా వచ్చిన డబ్బులను తమ్ముడు ఢిల్లేశ్ సొంతానికి వాడుకున్నాడు. అడిగిన అన్నను స్నేహితుడితో కలిసి కడతేర్చాడు.



సుమన్ (ఫైల్)

సాక్షి, పెద్దపల్లి: అగ్ని సాక్షిగా చేసిన ప్రమాణాలు.. నూరేళ్ల కలిసి ఉంటామని చేసిన బాసలు అభాసుపాలవుతున్నాయి. భార్యాభర్తల జీవితం కొన్నేళ్లయినా సాఫీగా సాగడం లేదు. అనుమానాలు, వివాహేతర సంబంధాలు, చిన్నపాటి తగాదాలు పచ్చని కాపురాల్లో చిచ్చు పెడుతున్నాయి. క్షణికావేశం హత్యలకు దారి తీస్తోంది. పలుచోట్ల భార్యను భర్త చంపితే, మరికొన్నిచోట్ల భర్తను భార్య అంతమొందిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇంకొన్ని చోట్ల ఆస్తి గొడవల్లో కుటుంబసభ్యులనే కడతేరుస్తున్నారు. ఇటువంటి సంఘటనలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ జరుగుతుండటం నేటి మానవ సంబంధాలపై ఆందోళనకు కారణమవుతున్నాయి.

మత్తు.. క్షణికావేశం

మద్యం మత్తు తల్లిదండ్రులు, పిల్లలు అన్న అనుబంధాన్ని మరచిపోయేలా చేస్తోంది. మత్తులో విచక్షణ కోల్పోయిన పలువురు దాడులు చేసుకుంటున్నారు. తేరుకున్నాక చూస్తే కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఒకరు చనిపోవడం, మరొకరు జైలుకు వెళ్తుండటంతో చిన్నారులు అనాథలుగా మిగులుతున్నారు. వ్యసనాలకు బానిసలవుతున్న పిల్లలు.. డబ్బులివ్వకపోతే తల్లిదండ్రులపై కక్ష పెంచుకుంటున్నారు. ఆస్తుల పంపకం విషయంలోనూ తమకు అన్యాయం జరిగిందనే భావనతో కొందరు కన్నవారిపై దాడులకు తెగబడుతున్నారు. గంజాయి, మద్యం అలవాటు ఉన్నవారు ఎక్కువగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు బాధిత కుటుంబాలకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నాయి.

ఎన్నో కారణాలు..

ప్రస్తుతం మానవ సంబంధాలు బలహీనమవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయని మానసిక నిపుణులు చెబుతున్నారు. తల్లితండ్రులు ఉద్యోగాలు చేస్తూ పిల్లలను పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడంతో సర్ది చెప్పే పెద్దలు కరువయ్యారని, దంపతులు విడాకులు కావాలంటూ ఠాణాల మెట్లెక్కుతున్నారని పేర్కొంటున్నారు. వీరిలో ఎక్కువ మంది పెళ్లయిన ఏడాది నుంచి ఐదేళ్లలోపు వారే ఉంటున్నారని, గొడవ పడే దంపతుల మధ్య మూడో మనిషిగా సెల్‌ఫోన్లు చేరి, బంధాలను దూరం చేస్తున్నాయని అంటున్నారు.

చిన్నచిన్న గొడవలే..



జగిత్యాల జిల్లాలో హత్యలకు చిన్నచిన్న గొడవలే కారణమవుతున్నాయి. నేరస్తులతోపాటు హత్యకు ప్రోత్సహించిన వారిని టెక్నాలజీ సహాయంతో గుర్తించి, కఠినచర్యలు తీసుకుంటున్నాం. 1, 2 కేసులున్న వారిపై రౌడీషీట్, పీడీయాక్ట్ ఓపెన్ చేస్తున్నాం.

– అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

నేరస్తులకు శిక్ష తప్పదు



కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, అక్రమ సంబంధాల వంటి కారణాలతో ఎక్కువగా దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నాయి. నేరాల విషయంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. నేరస్తులకు శిక్ష తప్పదు.

– రమేశ్, ఏసీపీ, రామగుండం

నమ్మకం లేకనే..



దంపతులకు ఒకరిపై ఒకరికి నమ్మకం లేకపోవడం అనేక అనర్థాలకు దారితీస్తోంది. జీవితాంతం కలిసి ఉండాల్సిన వారు ఒకరినొకరు చంపుకుంటున్నారు. ఇద్దరి మధ్య దూరాన్ని పెంచుతున్న ఫోన్ల వాడకాన్ని తగ్గించుకోవాలి. తరచూ మనసువిప్పి, మాట్లాడుకుంటే అనుబంధాన్ని పెంచుకోవచ్చు.

– రవివర్మ, మానసిక వైద్య నిపుణులు, జీజీహెచ్, రామగుండం